హిమబిందు






మన గాలి, మన నేల, మన వాళ్ళు,
మన లోగిళ్ళు...... నెలనెలా ఓ దృక్కోణం

# సినిమా సినిమా

విజయవాడలో ఉన్నప్పుడు, మా ఇంటికి దగ్గరలో మీనాక్షి అనే ఓ చిన్న పిల్ల ఉండేది... బహుశా మూడు నాలుగేళ్ళకి మించి ఉండవు... మీనూకి (అదా పిల్ల ముద్దు పేరు) సోఫా మీంచి దూకడం తప్ప దిగటం రాదు.... పైగా 'నేను మంకీని' అంటూ ఇంటి కొచ్చిన వాళ్ళ పైకి అమాంతం లంఘించుకుంటుంది.. కోపం వస్తే మంచినీళ్ళన్నీ నేల పాలు చేస్తుంది... పనిలో పని దెబ్బలు తగిలించుకుంటుంది.... ఎలా అదుపులో పెట్టాలో తెలియక వాళ్ళమ్మ నాలుగు తగిలించే మాటా నిజమే....

ఓసారి స్కూల్ కెళ్ళే రిక్షా మీంచి పడి, పాపం బాగా దెబ్బలు తగిలాయి... చిన్న పిల్ల కదా... సముదాయిద్దామని వెళితే... ఓ వైపు కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి.. అయినా సరే, లేచి నుంచుని... 'నాకేం కాలేదు... చిరంజీవి ఉన్నాడు' అని స్కర్ట్ దులుపుకుంటూ ఇంట్లోకి వెళ్ళిపోయింది.... ఓ క్షణం, అసలేమైందో అర్థం కాలేదు, వెళ్ళి వాళ్ళమ్మని అడిగితే, ఆవిడ తలపట్టుకుంటూ... 'నాకూ మా ఆయనకు ప్రథమ శత్రువు చిరంజీవేనమ్మా. ఏం చెప్పినా... ఆఖరికి కొట్టినా సరే ఒళ్ళప్పగించి.... నాకేం కాదు.... నాకు చిరంజీవి ఉన్నాడు... అని గట్టి గట్టిగా అరుస్తుంది తప్ప.... మా మాట వినదు... కనీసం స్కూల్ యూనిఫారం కూడా మార్పించలేను... అలాంటిది చిరంజీవి (మీను వాళ్ళ నాన్న తరచూ చిరంజీవిలా ఫోన్ చేసి వాళ్ళమ్మని గట్టెక్కిస్తుంటారట) చెప్పాడనుకో... వెంటనే పని జరిగి పోతుంది... అన్నదామె.

ఇక మా అమ్మమ్మ దగ్గరికి వొస్తాను, వయసులో ఉన్నపుడు బాగా సినిమాలు చూసేదట, ప్రస్తుతం నేను చెపుతున్నది ఇరవై ఏళ్ళ కిందటి మాట, డెభ్భయి ఏళ్ళ వయసులో, ఏ ఇతర భాషా పరిజ్ఞానం లేకుండానే, టీవీలో ఆదివారం మధ్యాహ్నం పూట వివిధ భారతీయ భాషలలో ప్రసారమయ్యే ప్రాంతీయ చలనచిత్రం దగ్గర్నుండి... సాయంత్రం హిందీ సినిమా వరకూ చూసేది.... చిన్నవాళ్ళం కదా .... మాకూ సరిగా అర్థం అయ్యీ, కాకుండా సబ్ టైటిల్స్ చదివే వాళ్ళం... కానీ మా అమ్మమ్మకి సినిమా మొదలు పెట్టిన పది నిమిషాల్లోనే హీరో హీరోయిన్‌లు ఎవరు, విలన్ ఎవరు కథ ఎలా మొదలైంది... ఇట్లాంటివన్నీ తెలిసి పోయేవి.... 'అదుగో, ఈ కుర్రాడు ఆ అమ్మాయికి అప్పుడే "ఓకు" (నాకు తెలిసి ఇది పేకాటలో ఉపయోగించే పదం... మా అమ్మమ్మకి ఆట రాదు... కానీ 'వల వేయడం' అనే కార్యక్రమాన్ని ముద్దుగా అలా పిలిచేది... ఏదో సినిమా చూసే ఆ పదాన్ని పికప్ చేసి ఉంటుందని నా అంచనా) వేయడం ప్రారంభించాడు... లాంటి కామెంటరీలు చెప్పేది. తెలుగు

సినిమా ఒస్తే మాత్రం... రావుగోపాలావు లాంటి విలన్ల పేరు స్క్రీన్‌పై కనిపించగానే.... 'వీడున్నాడూ...' అని మెటికలు విరిచేది.

పెద్దతనం, బయటికి కదల్లేదు... తనకు అందుబాటులో ఉన్న కాలక్షేపం... భాష తెలియాల్సిన పని లేదు. జీవితం నేర్పిన పాఠాల అనుభవం ...చాలు.

స్టెల్లా కాలేజీలో చదివే రోజులలో, సంవత్సరానికొకసారి మా క్లాసంతా కలిసి సినిమా కెళ్ళే వాళ్ళం... కామిడీ సినిమాకో లేదా తలాతోకా లేకుండా తీసిన ఓ పిచ్చి సినిమానో (బాగా కామెంట్స్ చెయ్యొచ్చు కదా!!) ఎంపిక చేసుకునే వాళ్ళం... అప్పుడు మా లక్ష్యం కేవలం సినిమా హాల్లో గోల చెయ్యడం....

ఇలా వివిధ దశల్లో, రకరకాల అనుభవాలు... మనందరికీ ఉన్నాయి.

ఇతర కాలక్షేపాలకు సరిపడేంత సొమ్ములేని మన మధ్య తరగతి దేశంలో, ప్రజల జీవితంలో సినిమా ఒక భాగం అనటంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. నేనూ అందుకు మినహాయింపేమీ కాదు. చదువు ముగించుకుని ఉద్యోగంలో చేరేవరకు సినిమా అంటే టైమ్ పాస్... ఎంజాయ్‌మెంట్... అప్పుడప్పుడూ మంచి అనుభూతి... కానీ ఆ తరువాతే రకరకాల ప్రశ్నలు మొదలయ్యాయి.

జర్నలిస్టుగా ఉద్యోగంలో చేరిన కొత్తలో తెలిసిన విషయం ఏమిటంటే, తెలుగు సినిమాలపై రివ్యూలు స్వేచ్ఛగా రాసేంత స్థోమత ఆంధ్ర దేశంలోని ప్రధాన దినపత్రికలకు కూడా (ప్రస్తుతం అయితే ప్రధాన మీడియాకు) లేదని, ప్రేక్షకులు సగం సినిమా కూడా చూడకుండా పారిపోతున్నా, వాటి గురించి కూడా 'బాగా లేదు' అని రాస్తే (లేదా టీవీలో చెపితే) సదరు నిర్మాత, దర్శకుడు, నటులు (హీరోలు అంటే బావుంటుంది) మీడియా సంస్థలపై పడి బెదిరింపులకి దిగిన (అలాగే ఆంక్షలు పెడుతున్న) సందర్భాలు ఎన్నో... ఇక్కడ మనకి పేర్లనవసరం... అలాగే చిన్నా, పెద్దా తేడాలు... కానీ ఒక సగటు ప్రేక్షకురాలిగా మనం గొప్పవాళ్ళనుకునే వారికి, తమ ప్రతిభ మీద ఎంత ఆత్మ విశ్వాసం ఉందో బయటపడ్డప్పుడు చిరాకేసేది. వినియోగదారుడికి ఉండే సమాచార హక్కుని హరిస్తూ తద్వారా మోసగిస్తున్నారనిపించేది.

కళకి లేదా కళాకారులకి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఆయువు పట్టులాంటివి కదా... అందుకు సంబంధించిన కనీస స్పృహ కూడా లేకుండా 'వాక్యాలని' డబ్బుతో కొప్పెట్టేయాలనుకునే ఆలోచనా సరళి ఉన్న రంగాన్ని 'కళ'గా ఎందుకు గౌరవించాలనే ప్రశ్న మొదలయ్యింది... వీళ్ళని వ్యాపారస్తులు అనటమే వాస్తవం. అంతకు మించిన 'బిరుదు'లు ఒద్దనిపించేది. సినిమా రంగానికి చెందిన రకరకాల వ్యక్తుల్ని లేదా ప్రముఖుల్ని (అందరూ అనటం లేదు... కానీ చాలా మంది) ఇంటర్వ్యూలు చేసినప్పుడు కూడా అహంకారం, వ్యక్తి పూజ (సినీ రంగంలో బాబ్బాబు.. అంటూ అతి వినయాలు పోయే కాకా మాస్టర్లను మనం లెక్కపెట్టలేం అంటే నమ్మండి. కొత్త వాళ్ళెవరయినా అయితే, ఇదేదో కచ్చితంగా పాటించాల్సిన పరంపరేమో అన్న అయోమయంలో పడిపోవడం కూడా ఖాయం)లకు దాసోహం తప్ప ప్రజాస్వామిక విలువలపై వీళ్ళల్లో చాలా మందికి నమ్మకం లేదనిపించేది. కులాల లెక్కలతో పాటు, ఫ్లాప్ సినిమాని వంద రోజులు ఆడించుకునే ఫాల్స్ ప్రిస్టేజీలు, వాటికోసం జరిపే యాత్రలు... సభలు, అభిమానుల అష్టకష్టాలపై బాధ్యతారాహిత్యం ఇవన్నీ చూస్తున్నప్పుడు, ఇందుకు సంబంధించిన వార్తలు చదివినపుడు ఇప్పటికీ ఈ 'హీరో'యిజాలు వెగటనిపిస్తాయి. ఇవన్నీ వాళ్ళు తమని తాము మార్కెటైజ్ చేసుకునే విధానాలు కావచ్చు.

కానీ... అప్పుడప్పుడయినా సంస్కరణల గురించి వాళ్ళు ఆలోచించాలని నా ఉద్దేశం... సరిగ్గా ఇదే దశలో 'జెండర్ పాలిటిక్స్'కి చెందిన స్పృహ తోడయింది. స్త్రీ శరీరాన్ని సరుకుగా వినియోగించడం తప్ప మనసుకి, మనిషికి అంతగా విలువనివ్వని ఈ రంగం అంటే వ్యతిరేకత లేదా అసహనం ఏర్పడ్డాయి.

ఈ మాట అంటున్నాను కాబట్టి సినిమాలు చూడటం మానేశాను అనుకునేరు... నిజం చెప్పొద్దూ, వర్షం కురుస్తున్నా సరే.. నా ఫ్రెండ్ కౌముదితో కలిసి వెళ్ళేదాన్ని.... మనకింకో ప్రత్యామ్నాయం లేదు... అయితే, సినిమారంగం పట్ల ఇంత అసహనం ఉన్న నేను... ఇంకా ఎందుకు చూస్తున్నాను అని ఆలోచించిన సందర్భాలు కూడా లేకపోలేదు... కాకపోతే వాస్తవంలో కంటే తెరమీద సదరు "బ్రాండ్ లేబుల్స్'ని ఎంజాయ్ చేయగలం అనటంలో సందేహం లేదనే ముగింపుకి చాలా సార్లు వచ్చాను.

సరిగ్గా ఇదే సమయంలో సింధు తారసపడింది.... ఈ అమ్మాయికి ఎలాగైనా సినిమాల్లో చేరాలనే విపరీతమైన కాంక్ష... ఈ మాట నాతో అన్నపుడు తెగ బాధపడిపోయాను... ఒద్దు... ఇబ్బంది పడతావు.. హర్టవుతావు... నీ టాలెంట్‌కి మంచి ఉద్యోగాలొస్తాయి అని నిరుత్సాహ పరిచేదాన్ని.... కానీ తను చేసే ప్రయత్నాలు ... చేరుకోవాల్సిన లక్ష్యం పట్ల ఆమెకున్న గాఢత చూసినపుడు మాత్రం భలే ముచ్చటేసేది... అంతలోనే ఎవరో ఒకరి ప్రవర్తనతో ఆమె మనసు గాయపడేది.... ఓ వారం రోజుల పాటు అలా హాస్టల్‌లో మంచం మీద పడుకుని ఎనిమిదో రోజు... పట్టు వదలకుండా మళ్ళీ ప్రయత్నాలు మొదలుపెట్టేది... ఎందుకలా నిన్ను నువ్వు హింసించుకుంటావు...? అని ఓ రోజు అడిగితే, 'బిందూ...స్త్రీ సమానత్వం... స్వేచ్ఛ ఇలాంటి విషయాలు చాలా మాట్లాడతావు కదా... మరి నన్ను ఎందుకు ప్రోత్సహించలేక పోతున్నావు? అదే ఒక అబ్బాయి వాడి దగ్గరా వీడి దగ్గరా పని చేసి, తన్నులు తిని, ఆఖరికి పస్తులుండైనా సరే సినిమాల్లో విజయం సాధించాడనుకో... అతన్ని అందరూ ఆకాశానికి ఎత్తుతారా లేదా.... మీ మీడియా ఏమన్నా తక్కువా? నా స్థానంలో అతనే ఉన్నాడనుకో... నీ ఇంట్రస్టు చంపేసుకో అని చెప్తావా...? నా మనసు గాయపడ్డట్టే అతని మనసుని కూడా అనేక మంది గాయపరచి ఉంటారు... ఆడదానికి 'క్యారెక్టర్ ఎపాసినేషనే' ప్రధాన... అవరోధం... నీలాంటి వాళ్ళు కూడా అందుకు భయపడి నన్ను ఒద్దంటే ... మీ స్థాయిని నేనేం అంచనా వేసుకోవాలి?' అంది.

తన ప్రశ్న నన్ను చాలా వేధించింది... ఇంకెప్పుడూ ఆ అమ్మాయిని నిరుత్సాహ పరచకూడదనుకున్నాను. తరువాత కొంత కాలానికి ఓ మహిళా సంస్థ 'సినిమారంగంలో స్త్రీపాత్ర' అనే అంశంపై ఓ మీటింగ్ పెట్టింది. ప్రముఖ రచయిత్రి ఓల్గా మాట్లాడుతూ 'మహిళలు కెమేరా కన్నుని కాప్చర్ చెయ్యాలి. అప్పుడే స్త్రీలకి, సినిమాల్లోని స్త్రీ పాత్రలకి సరైన ప్రాతినిధ్యం ఈ రంగంలో ఉంటుంది' అనే అభిప్రాయం వ్యక్తం చేసినపుడు, ఇది నిజమైతే ఎంత బాగుండునని మనసు గంతులేసింది...

మరి స్త్రీల పాముఖ్యత పెరగాలంటే ముందారంగాన్ని కొంచెం సానుకూలతతో చూడక తప్పదు కదా... అందుకని నా ప్రశ్నలకి సమాధానాలు నేనే చెప్పుకోవడం ఆపేసి, ఇతరుల్ని అడగటం ప్రారంభించాను.

అప్పట్లో ఓ సినిమా మిత్రుడ్ని, కదిపితే, 'సినిమా గురించి వ్యతిరేకంగా రాయొద్దని ఎందుకంటామంటే, ఒక సినిమా మీద కనీసం మూడు నాలుగొందల కుటుంబాలు ఆధారపడి ఉంటాయి. అలాగే ఒక టిక్కెట్టు పోయినా వాళ్ళకా సినిమా మీద వొచ్చే సొమ్ములో కొంత పోయినట్టే... తద్వారా దాని మీద ఆధారపడ్డ కుటుంబాలకి నష్టం... అదే డబ్బులు బాగా ఒస్తే, మళ్ళీ ఇండస్ట్రీలోనే ఆ డబ్బు రొటేట్ అవుతుంది... ఆ కుటుంబాలకు ఇంకొన్ని రోజులు జీవనాధారం దొరుకుతుంది' అన్నాడు. సరే... ఈ మానవీయ కోణం ఏదో కొంచెం అర్థం చేసుకోదగ్గదిగానే ఉందని అనుకుందాం.... కానీ సినిమా బాగుండకపోతే... జనాలు ఎలాగో రారు కదా... మరి ఉన్నమాట రాస్తే ఎందుకంత ఉలుకు? అంటే, మొదటి వారంలో రివ్యూ వొస్తుంది... దాంతో అందరికి తెలిసి పోతుంది... అదే రివ్యూ రాదనుకో... ఆ బాడ్ టాక్ నాలుగైదు వారాలకి ఊపందుకుంటుంది.... ఈ లోపల ఎంతో కొంత సొమ్ము వసూలవుతుంది కదా... అనేది అతని సమాధానం... మరి విమర్శ అవసరం లేదా? అంటే ... ప్రేక్షకులకి మించిన విమర్శకులు లేరన్నాడు.

అంతటితో ఆగకుండా... మీ మీడియా ఏవన్నా మడికట్టుకుని కూర్చుందనుకున్నావా....? ఏం వాళ్ళకి డబ్బులు అవసరం లేదా...? మేం వాళ్ళ మీద ఎంత ఆధారపడతామో, వాళ్ళూ మా మీద అంతే. కాదని వాళ్ళిష్టం ఒచ్చినట్టు 'నిజాలు' చెప్పమను.అనే సవాల్ విసిరాడు. జర్నలిస్టులకి ఎంత మంచి అభిప్రాయాలున్నా, సంస్థల అధిపతుల ధోరణి గురించి తెలియనిదేముందండీ.... సినిమా వాళ్ళకి తక్కువ...

వ్యాపారస్తులకి ఎక్కువ... కాబట్టి నేనేం పెద్దగా మాట్లాడలేక పోయాను.

నాకున్న మరో ఫిర్యాదు, ఎంత సేపు ఆ రంగంలో పాతుకు పోయిన కుటుంబాల వాళ్ళు, ముఖ్యంగా కోస్తా వాళ్ళు తప్పితే కొత్త వాళ్ళు పైకి రాలేకపోతున్నారని, కాకపోతే ఈ మధ్య పరిస్థితి మెరుగు పడ్డట్టుగా అనిపిస్తోంది. ఇదే విషయాన్ని జర్నలిస్టు మిత్రుడు, నేటి ప్రముఖ డిస్ట్రిబ్యూటర్, నిర్మాత సురేష్ కొండేటితో అంటే, 'అలాంటిదేమీ లేదు. కొత్త వాళ్ళు సినిమా రంగంలో ఎప్పుడూ ఉంటూనే ఉన్నారు.. సినిమాలు తీశారు. కాకపోతే ఇంత పబ్లిసిటీ ఆరోజుల్లో లేదు. అందులోను ఇవ్వాళ్టేపు చిన్న బడ్జెట్ సినిమాలకి మార్కెట్ బావుండటం, వ్యాపార పరిధి (ఓవర్ సీస్ రైట్స్, కేబుల్ రైట్స్ లాంటివి) పెరగటం వల్ల కొంచెం జాగ్రత్తగా ప్లాన్ చేసుకుని కష్టపడితే అవి సక్సెస్ అయ్యే అవకాశాలున్నాయి. ఇలాంటి కారణాల వల్లే ఎన్నారైలు కూడా ఈ మధ్య సినీరంగంలోకి ఉత్సాహంగా అడుగు పెడుతున్నారు. బహుశా అందువల్ల సడన్‌గా సినిమా రంగంలోకి కొత్త నీరు వచ్చినట్టు అనిపిస్తోందేమో కానీ కొత్తవాళ్ళు రంగంలో ఎప్పుడూ ఉంటూనే ఉన్నారు. సరైన హోం వర్క్ చేయాలే కానీ ఎవరు రాణించాలనుకున్నా గండి కొట్టే వాతావరణం రంగంలో లేదు' అనే విషయాన్ని వివరించారు. ఈ ప్రశ్నని ఇంతటితో ఆపకుండా, ప్రముఖ దర్శకుడు రవికుమార్ (యజ్ఞం ఫేమ్) చౌదరిని ప్రశ్నించినపుడూ, 'అదివరకు సినిమా ప్రజలకి కొంత దూరంగా ఉండేది. అందువల్ల అనేక అపోహలు ఉంటే ఉండొచ్చు. కానీ ఎప్పుడైతే పరిశ్రమ మన రాష్ట్రంలో స్థిరపడిందో, మీడియా విస్తృతి పెరిగిందో ప్రజల్లో దీని పట్ల మంచి అవగాహన ఏర్పడింది. ఇందులోని వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలు, నైపుణ్యాల వివరాలు ప్రజలదాకా వెళ్ళాయి. పైగా సాంకేతికంగా సినిమా అభివృద్ధి చెందటం, అందుకు సంబంధించిన డిజిటల్ టెక్నాలజీలాంటివి నేర్చుకోవడం సాధారణ ప్రజలకి పెద్ద సమస్య కాక పోతుండటం లాంటి కారణాలు రాను రాను కొత్తవారికి అవకాశాల్ని పెంచుతున్నాయి. ఇది పరిశ్రమలో నేడు చోటు చేసుకుంటున్న ప్రధాన మార్పు. అయితే ప్రయత్నించిన వాళ్ళందరూ సక్సెస్ అవుతారని చెప్పలేం. ఏ రకమైన వారసులు కానివ్వండి... లేదా పరిశ్రమతో సంబంధం లేని వారు కానివ్వండి కష్టపడి, తమ ప్రతిభను నిరూపిమకోగలిగితేనే పైకొస్తారు. ఉదాహరణకి చిరంజీవి, బాలకృష్ణలాంటి వాళ్ళనే తీసుకోండి. వారి కంటూ ఒక సొంత ఇమేజ్ ఉంది. ప్రతిభ లేకుండా వారికా బిరుదులు రాలేదు. అలాగే ఎంతో మంది నటవారసులు ఒచ్చినా... ప్రతిభ లేని కారణంగా తెరమరుగవుతున్న వారు ఎంత మంది లేరు...? ఇక సినీ రంగం కళ లేదా జూదమా... అడుగుతుంటారు... నేనయితే కళతో కూడుకున్న పరిశ్రమ అంటాను... ఎందుకంటే మనం శ్రద్ధ పెట్టి, అంకిత భావంతో పని చెయ్యాలే కానీ పెట్టిన డబ్బంతా ఓవర్ నైట్‌లో పోవడం అనేది జరగదు' అని చెప్పారు.

సినిమాని వ్యాపారంగా కాదు. 'పరిశ్రమ'గా అర్థం చేసుకోవాలంటున్నారు. బావుంది... కానీ 'కళకి' అర్థం మారిపోవడాన్ని నేను ఇప్పటికీ జీర్ణించుకోలేక పోతున్నాను. బహుశా ఇది కలికాలం సమస్య కావచ్చు. ఇక స్త్రీల అవకాశాల సంగతేంటి... అనే అంశానికొద్దాం. ఈ మధ్య ఇండియా వెళ్ళినపుడు పరిశీలించే ప్రయత్నం చేశాను. ఒక రకంగా చెప్పాలంటే ఊహించినంత వేగంతో అభివృద్ధి జరుగుతున్నట్టనిపించింది. మీడియాలో పెరుగుతున్న అవకాశాల కారణంగా తొలుత టీవీ రంగంలో నిలదొక్కుకున్న మహిళల్లో చాలా మంది నేడు సినిమాల్లోని వివిధ విభాగాల్లోకి ప్రవేశిస్తున్నారు. మూఖ్యంగా మేకప్, డబ్బింగ్, ఎడిటింగ్, ప్రొడక్షన్, నృత్య దర్శకత్వం కథ- మాటలు, దర్శకత్వం, నిర్మాణం లాంటి విభాగాల్లో చురుగ్గా పాల్గొంటుండగా, అనేక మంది ప్రముఖ డైరక్టర్ల దగ్గర అసిస్టెంట్స్‌గా రాణిస్తున్నారు. ఈ రంగానికి చెందిన టీచింగ్ ఇన్స్టిట్యూట్లలో కూడా మహిళల సంఖ్య పెరుగుతోంది. ఎన్ఎఫ్‌డిసి లాంటి సంస్థల ద్వారా ఆర్థిక సహాయం తీసుకుని చిన్న లఘు చిత్రాలను నిర్మించే ఉద్దేశంతో ఉన్నామని కొంత మంది చెప్పారు. ఇది ఇంకా మొదలే కనుక వేరే forbidden zone లు ఏవైనా ఉంటే రాను రాను అటువంటి ఆంక్షలు కూడా పోతాయని నమ్మకంగా అనిపిస్తోంది.

ఓ వైపు ఇది మొదలు అంటూ అంత నమ్మకంగా ఎలా చెపుతున్నారనే అనుమానం రావొచ్చు... కానీ మనలాంటి వాళ్ళే లేదా మనకి దగ్గరైన వాళ్ళు ఎవరైనా మంచి స్థాయికి

పయనిస్తారను కోండి... ఆ ప్రభావం మన మీద తప్పకుండా ఉంటుంది. అలాగే నా మీద నా స్నేహితురాలు వనజ 'సక్సెస్' బాగా పని చేస్తోంది. జర్నలిస్టుగా ఉంటూ, ఫిల్మ్‌మేకర్‌గా కొత్త బాధ్యతల్ని చేపట్టిన తను, మొదటి డాక్యుమెంటరీ 'స్మరణ'తోనే మంచి పేరు తెచ్చుకుంది. అనేక చలన చిత్రోత్సవాల్లో ఈ డాక్యుమెంటరీ ప్రశంసలందు కోవడమే కాకుండా.... పోటీ విభాగాలకి కూడా చేరుకుంది. అంతటితో ఆగకుండా తన రెండవ డాక్యుమెంటరీ కోసం దాదాపు పదిహేను రోజుల అటు ఆంధ్ర, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల మధ్య నున్న దండకారణ్యంలో గడిపి, కాలినడకన ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి వెళుతూ ఆమె పడ్డ తపన, సాహసాల గురించి విన్నప్పుడు.... ఇక నాకే సందేహం కలగలేదు... మనకి బోలెడంత భవిష్యత్తు ఉందనటానికి... ఇది పోటీ ప్రపంచం...

ఒకరి సక్సెస్ వేరొకరికి స్ఫూర్తి.

